# వైకుంఠంలోఎన్నికలు...!

నారద మహర్షి త్రిలోక సంచారి కనుక... ఒకసారి భూలోకానికి కూడా వచ్చి దేశం నలు మూలలూ తిరిగి ఇక్కడి పరిస్థితులన్నీ గమనించి... వైకుంఠానికి తిరుగుప్రయాణమైనాడు.

'ఏం నారద మహాశయా.... ఈ మధ్య నీ దర్శనం బొత్తిగా కరువైంది. రాను రాను మరీ నల్లపూసవైపోతున్నావేమిటి? నారదుని రాక గమనించి శేషసాయిపై పరుండిన శ్రీ మహావిష్ణువు క్వశ్చన్ చేసాడు స్వామి!.

దేవలోకాలన్నీ తిరిగి తిరిగి బోరు కొట్టి కాస్తంత రిలీఫ్ కోసం... అట్లా కొన్నాళ్ల పాటు భూలోకానికి వెళ్లి వచ్చాను స్వామి!.

అంతేనా... దేవతలమైన మన పార్టీ ఫిరాయించి మరో కొత్త పార్టీలో చేరటానికై అక్కడికి వెళ్లవా...? వెటకారం ధ్వనించింది శ్రీహరి మాటల్లో...

అమ్మ పెట్టదు.. అడుక్కుతిననివ్వదనే సామెతలా... నాకిక్కడ ఎన్ని యుగాలున్నా... ఎదుగు బొదుగు లేని బ్రతుకైంది కదా?... దేశ దిమ్మరిలా తిరగటమే కదా నీ పని... భూలోకానికి వెడితే నైనా...అక్కడ ఏ సి.ఎం. పోస్టో, గవర్నర్ పదవో దక్కించుకోలేకపోతానా? అని వెళ్లాను.

'భళా! మంచి ప్రయత్నమే మరి.. నీకు పదవి ఏదేని దక్కినదా...;"

'మానవులు తెలివిలో మనలను మించిన వారు కదా!?.. వారిని మాయ చేయుట నా వల్ల కాలేదు. భూలోకమున ప్రజాస్వామ్య పద్ధతిన ఎన్నికలు జరుగుచున్నవి. ఎన్నికల బరిలో నిలిచి గెలిచిన వారిలో కొందరికే పదవి లభ్యమగునట. నేను కాంచినంతవరకు ప్రజాస్వామ్యము కన్పించనే లేదు. నిత్యమూ పదవుల కోసం ఒకరిపై మరొకరు బురద చల్లుకొనుట తప్పించి... ప్రజాపాలన మచ్చుకైనా కన్పించలేదు. ధనిక వర్గముదే పైచేయి. ఇతరుల పొట్టలు కొట్టి కొద్ది మంది బాగుపడుటయే భూలోక వాసుల లక్ష్యముగా అగుపించినది. విదేశీయ పాలకులను తరిమి కొట్టి... స్వాతంత్ర్యము వచ్చి అరువది వత్సరముదాటిననూ. దేశమంతటా దారిద్ర్యము తాండవించుచున్నది. నిర్భాగ్యులు... నిష్టదరిద్రుల సంఖ్య అత్యధికముగా కన్పించినది. ధనదాహము మానవులలో మితి మీరినది... చెప్పూ ఆగేడు నారదుడు.

ఓస్!... అంతేనా?..

'అంత తేలికగా కొట్టి పారేయకండి ప్రభూ! విప్లవకారుల దృష్టి దేవలోకాలపై కూడా పడినది. ఎప్పుడూ దేవతలపై బాంబులు వేసెదరో?.. ఇచ్చటనూ మందు పాతరలు పెట్టెదరో... మనలను సైతం వదలక మట్టుపెట్టెదరో నని భయపడుచుంటిని? రక్త పాతము... విద్రోహ

చర్యలు మనకునూ తప్పవేమో అన్పించుచున్నది. 'హిట్‌లిస్ట్'లో త్రిమూర్తులూ కలరట! ప్రస్తుతానికి ...నేనూ దేవేంద్రుడు ఈ బెడద నుండి తప్పించుకుంటిమి! కావున..త్వరలో త్రిమూర్తులు ముగ్గురూ పదవీచ్యుతులగుట ఖాయమని తోచుచున్నది నారాయణా!...

'నాకేం భయం లేదు. అలనాడు భారతయుద్ధము సలిపి దుష్టులను సంహరించిన వాడిని కదా!? దుష్ట శిక్షణ... శిష్ట రక్షణ.. చేయుటలో దిట్టని కదా?' గర్వాతిశయంతో శ్రీహరి నవ్వాడు.

'సార్! ఆరోజులే వేరు. ఇప్పుడు మీ విష్ణు చక్రము గద... బాణాలతో ప్రయోజనము శూన్యము.. ఇదివరలో దానవులు మాత్రమే దేవ లోకాలపై దండెత్తిరి. ఇప్పుడు... మానవుల దృష్టి కూడా మనపై పడింది. వరల్డ్ బ్యాంక్ అప్పు చాలటం లేదట. మన సంపదను కొల్లగొట్టవత్తురన్పించుచున్నది.

'పిరికి పందవలె మాటాడుచుంటివేల నారదా?- నా ధైర్య పరాక్రమములు ఎవరికి తెలియవు కనుక?

'ఈ కలియుగంలో అవేమీయూ పనికిరావు నారాయణా! బాంబుల సంస్కృతి పరిఢవిల్లుతున్నది. అణు బాంబుల కాలం వచ్చింది. ఇప్పుడు భూతల యుద్ధములు మోటైనవి. నేడు వైమానికదాడులు జరుగుచున్నవి. వాటి ముందు మీ ఆయుధములు దేనికీ పనికిరావు...'

'వైకుంఠమున ఏమున్నది?....'

'మీరున్నది క్షీరసాగరంపైన కదా?...భూ లోకంలో పశుసంపద తరిగి పోయి క్షీరము కరువగు రోజు దగ్గర పడినది. అప్పుడు వైకుంఠమున కొచ్చి క్షీర సముద్రములో గల పాలను టాంకర్లలో భూమికి తలరించెదరు. ఆ విధంగా పాల కొరత వారు నివారింతురు. క్షీర విప్లవానికి నాంది పలుకబోవు ఘడియలు దగ్గర పడినవి స్వామి! ఎందుకైనా మంచిది మీ సెక్యూరిటీ పెంచుకోండి. రక్షణ వలయాన్ని ఏర్పరచుకోండి...' తనకు తోచిన సలహా ఇచ్చాడు నారదుడు.

శ్రీహరి మారు మాటాడకుండుట చూచి.. నిద్రలోకి జారి పోవుట గమనించి నారదుడు అక్కడి నుండి తప్పుకున్నాడు నారదుడు.

★★★★★

భూలోకంలో వ్యవహారాల గురించి...ముఖ్యంగా అయిదేళ్ల కోమారు ఎన్నికలు నిర్వహించుట గురించి దేవతలందరికీ నారద మహర్షి టముకేశాడు. అడిగిన వారికి అడగని వారికి అందరికీ చెప్పి నోటి దూల తీర్చుకున్నాడు. దాంతో... పైసా ఖర్చులేకుండా డోర్ టు డోర్ ఓరల్ ప్రచారం జరిగినట్టయింది.

నారదుడి పద్ధతి బొత్తిగా నచ్చలేదు శ్రీహరికి. ఎన్నో యుగాల నుండి ఒకే పదవిలో పాతుకు పోయిన దేవతల ముడ్డి కిందకు నీళ్లు తెస్తున్నాడు. వారిలో విప్లవ జ్వాలలు రేపుతున్నాడు. ఎన్నికలంటూ పదవులకే ఎసరు పెడుతున్నాడు.

ఇన్నాళ్లూ.. నారదుడు తన అనుంగు భక్తుడని భావించాడు... భూలోకం వెళ్లి వచ్చినప్పటి నుండి తలనొప్పిగా మారాడు.

ఇక ఉపేక్షించి లాభం లేదు. నారదుడిని శాశ్వతంగా దేవలోకం నుండి తరిమేసి పీడవదిలించుకోవాలి! అందుకొక్కటే మార్గం! ఇతగాడిని భూలోక వాసిగా ఉండిపోయే విధంగా మళ్లీ దేవలోకం లోకి వచ్చే అవకాశం లేకుండా శపించటం ఒక్కటే మార్గంగా తోచింది.

ఆ విధంగా చేస్తే... బ్రహ్మకి కోపమొస్తుందేమో. పోనీ... ఆయనతో సంప్రదించి నిర్ణయం తీసుకుంటే? -అమ్మో ఆయన గారు మానస పుత్రుడిని శాశ్వతంగా భూలోకంలోనే వుండి పోయేటందుకు ససేమీరా ఒప్పుకోడు.

శ్రీహరికి ఏం చేయటానికీ దిక్కుతోచటం లేదు. ఎన్నికలు జరిపితేనో?...అమ్మో...అందరి కళ్ళు వైకుంఠం మీదనే! తనను పదవీచ్యుతుడిని చేయాలనేదే అందరి దేవతల ఆలోచన!.

ఎన్నికలు జరిగేక తాను మరో పదవిలోకి వెళ్లేకంటే... బ్రహ్మ...ముక్కంటినీ...ఇంద్రుడిని పిలిపించి సీట్ల సర్దుబాటుపై సమావేశం ఏర్పాటు చేసి అందరూ కలిసి ఒకే నిర్ణయానికి రావటం సమంజసంగా తోచింది.

'నాథా! ఏమది?...తీవ్ర ఆలోచనలో వుంటిరి? పవ్వళించియున్న శ్రీహరి పాదములు వత్తుతూ అడిగింది లక్ష్మీదేవి.

ఇకపై నీవు పాదములు వొత్త వలదు...

'అదేమి నాథా'

'భూలోక మందు స్త్రీలు భర్తలకుసేవలు చేయుట మానుకొనిరి. ఇక్కడ నీవు నాపాద సేవ చేయుచున్నచో స్త్రీ జనోద్ధరణ సంఘము వారు వైకుంఠమున కొచ్చి స్త్రీల మనోభావాలను కించపరచుచున్నానని నాపై కేసు బనాయించి నన్ను అప్రతిష్టపాలు చేయుదురు...అందుకని లక్ష్మీ!

'ఎంతటి దౌర్భాగ్యస్థితి పడతులకు దాపురించినది. పతి సేవ చేయుట కూడా భూలోక స్త్రీలు పాపమను చుంటిరా? ఇదేమి వైపరీత్యము స్వామి?

'అదేమరి నాగరికతంటే! నువ్వొకమారు భూలోకమునకు పోతి వేని...వారితో పాటు జెండాలు పట్టుకుని వీధుల వెంట తిరిగి నినాదాలిచ్చుచూ... వారి పద్ధతులే వచ్చును. తిరిగి వైకుంఠమునకు నీవు రావలెనన్ననూ మనస్కరించదు.'

'ఔరా!-భూలోకవాసు లెంతదుష్టులు?....ఎంతటి దుర్మార్గులు..?పతి భక్తి మరిచారా? - పతులను దూషించుటయా? వినాశకాలే-విపరీతబుద్ధి'లక్ష్మీ దేవి బాధతో వగర్చెను.

'నా పదవిపై ఆ వృద్ధ బ్రహ్మ చూపు పడినది. నన్ను పదవీచ్యుతుడనుచేయ ప్రయత్నించు చున్నాడు. ఇక అముక్కంటి ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు జరుపవలెనని పట్టుబట్టు చున్నాడు. అతగాడికి కూడా నా పదవి పై ఆశ జనించినది. ఏమి చేయుదము. చెడుకాలము దాపురించినది.

'మరి తమ నిర్ణయమేమిటి నాథా!'

'ఏమున్నది ఎన్నికలు ఎటుల నిర్వహించవలెనో మనకు తెలియని విద్య కదా? భూలోకమునకు వెడలి అచటి ఆరితేరిన వృద్ధ నాయకులను ఆశ్రయించి...ఎన్నికల గురించి అవగతము చేసుకొనవలసి వచ్చును. డబ్బుతో ఓట్లు కొనుట... ఓటర్లను మభ్య పెట్టుట... దొంగ వోట్లు వేయించుకొనుట... బేలట్ బాక్సల అపహరణ వంటి నీతి బాహ్యమైన పనులు నాకు చేతకావాయె?...

ఇంతలో గణేశుడు అచటికి వచ్చెను.

'ఏమిటి వినాయకా...దారి తప్పి వైకుంఠమునకేతెంచితివి? శ్రీహరి ప్రశ్నించాడు.

'ఆకలి గొంటివేమో కుమారా... రమ్ము...! జీడిపప్పు వేసి ఉప్మా చేసితిని... తిందువుగాని..' లక్ష్మీదేవి ప్రేమతో అన్నది.

'వాములు తినే స్వామికి పచ్చగడ్డి పలహారమాని? లంబోదరునకు నీవు పెట్టు కొద్దిపాటి ఉప్మా ఏ పాటి?..

'నన్ను ఏడిపించకండి! అసలే సమస్యలతో కొట్టుమిట్టాడుచున్నాను. ఏడుపు ముఖం పెట్టి మాట్లాడాడు గణపతి.

'అవున్లే! ప్రాబ్లమ్ వున్నవారే కదా నా వద్దకు వత్తురు. చెప్పుమునీబాధేమిటో?...

'భూలోకమున 'రాట్‌కిల్' అను మందు కనిపెట్టిన మానవులు నా ప్రియ వాహనమైన మూషిక సంహారమునకు పెద్ద ఎత్తున పూనుకొనిరి!...

'ఓస్! ఇంతేనా?... ఆ వాహనము విడిచి మరొక వాహనము దేనినైనా కోరుకొనుము గణనాయకా!

'నాకసలూ ఏదీ వద్దు! వాహనమూ వద్దు..'

'ఎందుకని?'

'భూలోక వాసుల కోర్కెలు తీర్చుట నా వల్ల కాకున్నది స్వామీ! అలవిగాని కోరికలు

కోరుచున్నారు...!

'అటుపైన ఒక పని చేయుము. భూలోకమున ఎన్నికలు జరుగనున్నవి. నీవునూ అచటికి వెడలి ఓ పార్టీ కొమ్ముకాచి... పార్టీ టిక్కెట్టు పొంది... ఎలక్షన్లో పోటీ చేసి గెలిచి మంచి పదవిని దక్కించుకొనుము. సుఖపడెదవు! కోట్ల కొలది ధనము లంచము రూపంలో ఆర్జించవీలగును.

'నాథా! నేను కూడా భూలోకమునకు వెడలి... ఎన్నికల్లో గెల్చి... రాజ్యాధికారము చేపట్టెదను.. ఆశతో అడిగింది లక్ష్మీదేవి.

టాపిక్ డైవర్ట్ అవటం గమనించిన వినాయకుడు అక్కడి నుండి తప్పుకుని వెడలిపోయెను.

'హృదయేశ్వరీ! నీవు భూలోకానికి వెళ్ళద్దు. అక్కడి మానవులు రాక్షసులు..! నిన్నూ నీ అందమును చూచి నిన్ను ఒంటరిగా బతకనీయరు. నీపై అత్యాచారమునకు పాల్పడుదురు. వారి బారి నుండి తప్పించుకొనజాలవు. కోరి కష్టముల పాలు కాకుము"

'అటులైన నాకువేరే దారే లేదా నాథా...?

'వున్నది.! రాబోవు ఎన్నికలలో నేను ఇంద్రపదవికి నామినేషన్ వేసెదను. గెలిచి దేవలోకమునకు అధిపతినగుదును. ఇద్దరమూ ఐరావతముపై కూర్చుని విహరింతము. రోజుకో పారిజాత పుష్పము నీ తలలో తురిమెదను'.

'వలదు. పారిజాతమూ వలదు... మీ ఎత్తు గడలు వలదు.. పురుషాధిక్యతకు దేవలోకమందు సైతము మంగళహారతి పాడెదరు. ఎన్నికలు జరుపవలసినదే! స్త్రీ లందరము అన్ని పదవులకు పోటీ చేసి అధికారము మేము హస్తగతము చేసుకుందుము. పరిపాలన మేము సాగించెదము. పడతుల తఢాకా ఏమిటో... ఎటులుండునో రుచి చూపెదము. అప్పుడు గానీ... మీ మగ జాతికి బుద్ధిరాదు..

'ఔరా!.. ఎంతమద మెంతకండకావరము? మగువలు పురుషులను సైతం లెక్క చేయక ఎన్నికలలో నిలుతురా? గెలిచి మాపై పెత్తనము చలాయించుదురా? ఏమి ఈ ఘోరకలి? ఏమి పడతుల దుస్సాహసము? క్షమింపజాలను. శేష పాన్పుపై పరుండిన శ్రీహరి కోపముతో రెచ్చి పోయి లేచి కూర్చున్నాడు.

'పో బాల పొమ్మికన్... నా చెంతకు రావలదు. నాతో సహచర్యము చేయవలదు...' అంటూ గొంతెత్తి పాట పాడుచూ అచ్చటి నుండి శ్రీహరి వెడలిపోయెను.

దేవలోకమున ఎన్నికలు తొసారిగా..అత్యంత ప్రశాంత వాతావరణములో జరిగెను.

శచీదేవి... సరస్వతీ దేవి...లక్ష్మీదేవి...వగైరా మగువలంతా ఎన్నికల్లో పోటీ చేసి అత్యధిక మెజారిటీతో గెలిచి... వారి వారి భర్తలను ఓడించి ఆయా పదవులను అదిష్ఠించిరి.

బ్రహ్మవిష్ణుమహేశ్వరులకే కాదు... వినాయకుడికి, సుబ్రహ్మణ్య స్వామికీ, ఇంద్రునికి అష్టదిక్పాలకులకు... నవగ్రహాది దేవతలకు... చివరికి యమధర్మరాజుకి సైతం ఓటమి తప్పలేదు.

అనేకమందికి డిపాజిట్లు కూడా దక్కకుండా పోయినయ్.

నారద మహర్షికి ఎవరూ పోటీ లేనందున అయనే ఆ పదవిలో కంటిన్యూ అవటం అందరినీ ఆశ్చర్యపరిచింది.

ఎన్నికలలో ఓడిన వారంతా ఒక చోట చేరి విలపించుచూ తమ గోడు ఎవరికి విన్నవించుకొనుటో దిక్కుతోచక అవమాన భారంతో దుఃఖించుచుండిరి.

వారివారి వాహనములను సైతం పదవినలంకరంచిన భార్యల కొసగి కాలి నడకతో సంచరించుచుండిరి!

సూర్యుడు కాంతివిహీనమాయె! చంద్రుడు కళతప్పి విలపించుచుండె.

ఇంతలో నారదుడు అటుగా వచ్చి అక్కడి మగవారిని చూచి వారి స్థితికి జాలిపడి 'ఓ మాజీ నాయకులారా... విలపించకుడు! దేవలోకమున కూడా నేనే స్వయముగా రాజ్యాంగమును రచించి ఇప్పుడే శ్రీ వైష్ణవిమాత అయిన లక్ష్మీదేవికి అందచేసితిని! వందవత్సరములకొకమారు జరుగు దేవతల ఎన్నికలలో మరల మీరు పోటీ చేసి గెలువవచ్చు! అంత వరకు విలపించుట మాని మీమీ 'పపర్స్' ఎన్నికైన పడతులకొసంగి తృప్తి చెందుడు... అని అదృశ్యమాయెను.

ఇదండీ దేవలోకం ఎన్నికల కథకామీషు!!

- (సమాప్తం) -